ఆటల పూదోటలు

- మురళీనగర్‌లో అందుబాటులో క్రీడా వేదికలు
- క్రీడాకారులకు ప్రత్యేక సౌకర్యాలు
- చిన్నాపెద్దా సద్వినియోగం చేసుకుంటున్న వైనం

మురళీనగర్: చిన్నారులు, యువతకు క్రీడల పట్ల ఆసక్తి ఎక్కువ. దీంతో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు బ్యాటు, బాలు పట్టుకుని ఆడేసుకుంటారు. ఇటీవల కాలంలో బ్యాడ్మింటన్‌పై విపరీతమైన మోజు పెరిగింది. వాలీబాల్, క్రికెట్ వంటి క్రీడలైతే ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. మరి కొందరు చిన్నారుల ఆసక్తి మేరకు స్విమ్మింగ్, స్కేటింగ్ నేర్పిస్తున్నారు. అయితే వారికి ఆసక్తి కలిగిన ఆటలు ఆడుకోవాలంటే అందుకు సరైన వేదికలు, మైదానాలు అవసరమవుతాయి. ఇది గమనించిన మురళీనగర్‌లోని పలు పార్కుల నిర్వాహకులు క్రీడాకారులకు అనువుగా కొంత స్థలాన్ని కేటాయించి క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దారు. కొన్ని చోట్ల ఉచితంగా క్రీడలు ఆడుకోవడానికి అవకాశం కల్పిస్తే, మరి కొన్ని ప్రాంతాల్లో నామినల్ రుసుముతో క్రీడల్లో ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నారు. కోచ్‌లను ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు.

క్రీడలతో పాటు వ్యాయామం..
మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో క్రీడలతో పాటు వ్యాయామానికి ఏర్పాట్లు ఉన్నాయి. ఇక్కడ నగరంలోనే అత్యాధునికమైన స్కేటింగ్ రింక్ ఉంది. దీంతో ఈ పార్కును స్కేటింగు పార్కుగా కూడా పిలుస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం కలిపి వంద మంది చిన్నారులు స్కేటింగు శిక్షణ పొందుతున్నారు. రాష్ట్రస్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఈ స్కేటింగ్ రింక్ వేదికగా నిలుస్తోంది. ఇక్కడ శిక్షణ పొందిన స్కేటర్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఇదే ప్రాంగణంలో రెండు బ్యాడ్మింటన్ కోర్టులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా పార్కుకు అనుబంధంగా అధునాతనమైన స్విమ్మింగ్ పూల్ అందుబాటులో ఉంది. సోమవారం మినహా అన్ని రోజుల్లోనూ ఉదయం 6-7, 7-8, సాయంత్రం 5-6, 6-7 వేళల్లో ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. మహిళలకు ప్రత్యేకంగా సాయంత్రం 7 నుంచి 8 గంటలకు ప్రత్యేకంగా కోచింగు ఇస్తున్నారు. పురుషులు, మహిళలకు ప్రత్యేక కోచ్‌లను ఏర్పాటు చేశారు. వ్యాయామం చేసుకోవాలనుకునే వారికి ఓపెన్ జిమ్‌తో పాటు, వైశాఖి భవనంలో జిమ్ అందుబాటులో ఉంది.

టెన్నిస్ కోర్టులో క్రీడలకు ప్రోత్సాహం..
మురళీనగర్‌లోని స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన స్టేడియంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. మురళీనగర్ సెక్టార్-6లోని ఈ స్పోర్ట్సు అసోసియేషన్ భవన సముదాయం రెండు రకాల క్రీడలకు వేదికగా నిలుస్తోంది. ఇక్కడ విశాలమైన టెన్నిస్ కోర్టు అందుబాటులో ఉంది. చిన్నారులతో పాటు పెద్దలు ఉదయం, సాయంత్రం టెన్నిస్ ఆడుకోవడానికి అవకాశం కల్పించారు. అందరికీ అందుబాటులో టెన్నిస్‌లో కోచింగ్‌కు అవకాశం కల్పించారు. ఇదే ప్రాంగణంలో నగరంలో ఎక్కడా లేని విధంగా ఇండోర్ బ్యాడ్మింటన్ వుడెన్ కోర్టు ఉంది. ఉదయం, సాయంత్రం పిల్లలు, పెద్దలకు కోచింగు ఇస్తున్నారు. ప్రతి ఏడాది పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నారు. సాయంత్రం పూట ఫ్లడ్‌లైట్ల వెలుగులో బ్యాడ్మింటన్ ఆడుకోవచ్చు. ఇక యోగా నేర్చుకునాలనే వారికి యోగా శిక్షణ కేంద్రం ఇక్కడ ఉంది.

క్రికెట్ నెట్ ప్రాక్టీసుకు ప్రత్యేక ఏర్పాట్లు..
మురళీనగర్ సెక్టార్-8లోని హరిత పార్కుకు అనుబంధంగా క్రికెట్ కోచింగ్ కేంద్రం నడుస్తోంది. ఇక్కడ ఆసక్తి కలిగిన యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమైన క్రికెట్ నెట్ ప్రాక్టీసు మైదానం అందుబాటులోకి తెచ్చారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగుతో పాటు ఆల్ రౌండ్ ప్రతిభకు ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. పార్కులో బ్యాడ్మింటన్ కోర్టు అందుబాటులో ఉంది. బృందావన్ పార్కులో బ్యాడ్మింటన్ కోర్టుతో పాటు, వాలీబాల్ కోర్టు అందుబాటులో ఉంది. ఇక్కడ ఉచితంగా ఆడుకోవచ్చు.


హరితపార్కు వద్ద క్రికెట్ నెట్ ప్రాక్టీస్ గ్రౌండ్


బౌలింగ్ చేస్తున్న యువకుడు


టెన్నిస్ కోర్టు


మురళీనగర్‌లోని స్విమ్మింగ్ పూల్



మురళీనగర్ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రీడా ప్రాంగణం


వైశాఖి పార్కులో ఓపెన్ గ్రౌండ్‌లో బ్యాడ్మింటన్ ఆడుతున్న స్థానిక క్రీడాకారులు


ఇండోర్ వుడెన్ బ్యాడ్మింటన్ కోర్టు


స్కేటింగ్ ప్రాక్టీసు చేస్తున్న చిన్నారులు

క్లుప్తంగా

భద్రతా పోటీల్లో గైస్ విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా డిపార్టుమెంట్ ఆఫ్ ఫ్యాకల్టీ నిర్వహించిన భద్రతా ప్రమాణాలపై నిర్వహించిన పోటీల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగులో భద్రతా నినాదాలు అనే అంశంలో గైస్‌కు చెందిన టి.స్వామినాథన్ ప్రథమ బహుమతి, ఆంగ్లంలో ఎస్.సాగర్ కుమార్ ద్వితీయ బహుమతి, వర్కుషాప్ మెషినరీ సేఫ్టీ చిత్రలేఖన పోటీలో జి.కుసుమ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. వీరిని గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అభినందించారు.

ప్రత్యేక పానీయం పంపిణీ


ప్రత్యేక పానీయం పంపిణీ చేస్తున్న ముస్లింలు

మద్రిపాలెం: రంజాన్ మాసం సందర్భంగా జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్ నగర్ మస్జీద్-ఈ-అల్ ఖదీర్ వద్ద ఆదివారం మసీదు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు ప్రత్యేకంగా తయారు చేసిన పానీయాన్ని పంపిణీ చేశారు. అలాగే ఉపవాస దీక్షలో పాల్గొన్న ముసిల్లంకు వివిధ రకాల పండ్లు, పదార్థాలు అందజేశారు. నెల రోజుల పాటు మసీదు ప్రాంగణంలో ముస్లింలకు ప్రత్యేక పానీయాన్ని అందజేయనున్నట్టు మసీదు కమిటీ అధ్యక్షుడు మున్నా తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు షఫీ, నూరీ, రంజాన్ వలీ, స్థానికులు పాల్గొన్నారు.

కరాటే కోచ్‌కు సన్మానం


ఎల్లారావును సత్కరిస్తున్న పొన్నాడ అప్పారావు తదితరులు

మద్రిపాలెం: ఎంతో మందికి కరాటేలో కోచింగ్ ఇచ్చిన ఇంటర్‌నేషనల్ కోచ్ ఎల్లారావును జీవీఎంసీ 51వ వార్డు ఈస్ట్‌పార్కులో ఆదివారం ఉదయం ప్రభుత్వ పాఠశాల రిటైర్డ్ డ్రిల్ మాస్టర్ పొన్నాడ అప్పారావు, పార్కు అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. ఆయన శిక్షణలో రాటుదేలిన ఎంతో మంది బంగారు పతకాలు సాధించారని, ఎల్లారావు శిక్షణ అటువంటిదని ఆయనను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక హారతి ఇస్తున్న దృశ్యం

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఫోర్త్ టౌన్ సీఐ సత్యనారాయణ


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా సీఐ రమణ

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తప్పవని ఫోర్తుటౌన్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వేలి ముద్రలతో పాటు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి షాపుల వద్ద అల్లరి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న వారిపై సీరియస్ అయ్యారు. మంచిగా ఉంటే మంచిగా ఉంటాను.. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గొడవలకు పాల్పడడం, బెదిరింపులకు దిగడం చేస్తే చర్యలు తప్పన్నారు. రౌడీషీటర్లపై నిఘా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటరావు, నర్సింగరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తగాదాలకు దిగితే కఠిన చర్యలు..
రౌడీ షీటర్లు అల్లర్లు చేయకుండా ఉండాలని ద్వారకా సీఐ డి.వి.రమణ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రోజువారీ విధానాలపై ఆరా తీశారు. కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుంది కనుక శాంతియుతంగా జీవించాలని హితవు పలికారు.

పోర్టు ఆస్పత్రిని సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలి



పోర్టు ఆస్పత్రి వద్ద దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రిని సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని, ప్రైవేటీకరణకు ఒప్పుకునేది లేదని సీఐటీయూ పోర్ట్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు తెలిపారు. పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 160వ రోజుకు చేరాయి. ఆదివారం జరిగిన దీక్షలో పాల్గొన్న పద్మనాభరాజు మాట్లాడుతూ పోర్టుకు ఈ సంవత్సరం సుమారు రూ. 800 కోట్లు లాభాలు వచ్చాయని, పోర్టు వద్ద రిజర్వు ఫండ్లు, వేల ఎకరాల భూములు ఉన్నాయని తెలిపారు. అయినా ప్రైవేటీకరించాలనే నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. కొన్ని వేల మంది ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామని, వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కె. సత్యనారాయణ, జె. సత్యనారాయణ, బి. జగన్, రామలింగేశ్వరావు, రాఘవులు, నాయుడు, సీహెచ్ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

మూత్రపిండాల సమస్యలపై అవగాహన సదస్సు


వైద్యులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

కంచరపాలెం: ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీస్టార్ వాకర్స్ క్లబ్‌లో అపోలో, కేర్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మూత్ర పిండాల సమస్యలపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి సుకుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వాకర్ల కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి పలు సేవలు అందించడం అభినందనీయమన్నారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ మూత్ర పిండాల సమస్యలు, పరిరక్షణ కోసం అప్రమత్తంగా ఉండాలన్నారు. డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ సురేష్, డాక్టర్ భార్గవి నేతృత్వంలో సుమారు 250 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు క్లబ్ కార్యదర్శి కాళ్ల వెంకటప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు జయతి ఉమామహేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు జె.రమేష్‌కుమార్, కిషోర్‌కుమార్, ఇమ్మానుయేల్, జాలివాకర్, ఏఎల్ నరసింహారావు, క్లబ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న నూతన కార్యవర్గం అధ్యక్ష, కార్యదర్శులు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ విలేజ్ వార్డు సెక్రటేరియట్ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎనర్జీ అసిస్టెంట్ (జేఎల్‌ఎం- గ్రేడ్2) కార్యవర్గ ఎంపిక ఆదివారం జరిగింది. సీతమ్మధారలోని ఏపీఎస్‌ఈబీ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమం అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ పి. రాజు, స్టేట్ సంయుక్త కార్యదర్శి విక్రమ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ఎనర్జీ అసిస్టెంట్లు హాజరయ్యారు. డిస్కాం ప్రెసిడెంట్ ఎస్. శ్రీనివాసరావు, కోశాధికారి రవీంద్రతో పాటు జిల్లా నూతన కార్యవర్గ అధ్యక్షుడు నారాయణ మధు, వైస్ ప్రెసిడెంట్ బి. రాజేష్, సెక్రటరీ పి. శ్రీకాంత్, కోశాధికారి శివసాయి, సంయుక్త కార్యదర్శి సీహెచ్ గోవింద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లు, జేఎల్ఎం గ్రేడ్- 2లు ఎదుర్కొంటున్న సమస్యలపై నూతన కార్యవర్గ సభ్యులందరూ చర్చించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

బ్రహ్మాజీరావు స్మారక పురస్కారం ప్రదానం


పురస్కారం అందుకుంటున్న వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రభావతి దంపతులు

సీతంపేట: విశాఖ సాహితీ, ఘండికోట సాహితీ పీఠం సంయుక్తంగా ఘండికోట బ్రహ్మాజీరావు, సీతారామమ్మ స్మారక సాహితీ పురస్కార ప్రదాన కార్యక్రమం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. విశాఖ సాహితీ అధ్యక్షులు కోలవెన్ను మలయవాసిని ఆధ్యక్షతన జరిగిన సభలో ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రభావతి దంపతులకు ముఖ్య అతిథి, ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. పురస్కార గ్రహీతలు బ్రహ్మాజీరావు కుటుంబంతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త అయ్యగారి సీతారత్నం 'బ్రహ్మాజీరావు గారి కథలు, స్త్రీ పాత్రలు' అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాజకుమారి, భమిడిపాటి సుబ్బారావు, డి.వి.సూర్యారావు, విశాఖ సాహితీ కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల, ఘండికోట విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం


షకీల బేగంను వసతి గృహంలో చేర్పిస్తున్న పచ్చిరిపల్లి రాము తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డుకు చెందిన ఎం.డి.షకీలా బేగం 20 రోజులుగా కేజీహెచ్ ఔట్‌గేట్ వద్ద పడి ఉంది. విషయం తెలుసుకున్న వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చిరిపల్లి రాము, పీవీ నరసింహారెడ్డి, పూతి కృష్ణారెడ్డి, మజ్జి రెడ్డి ఆమెకు తగిన సపర్యలు చేసి ఆహారం అందించారు. అనంతరం టూటౌన్, ఎంఆర్ పేట సీఐల సహకారంతో టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ ఏయూటీడీ మహిళల నిరాశ్రయ వసతి గృహంలో చేర్పించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైశాఖి స్పోర్ట్సు పార్కులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కిమ్స్ ఆస్పత్రి సహకారంలో నిర్వహించిన ఈ శిబిరంలో కార్డియో వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ భరత్ అరుణ, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సర్దార్ రామ్, హెమటో అంకాలజిస్టు డాక్టర్ కోట కిషోర్‌కుమార్, కార్డియాలజిస్టు డాక్టర్ కిషోర్ కాహినందుని పాల్గొని ఆరోగ్య సంరక్షణకు సంబంధించి పలు సలహాలు అందించారు. కార్డియో వాస్క్యులర్ సమస్యలపై డాక్టర్ భరత్ అరుణ్ వివరణాత్మకంగా వివరించారు. వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు తెలిపారు. పలువురి సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేశారు. శిబిరంలో బీఎండీ, ఈసీజీ, బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి, కార్యదర్శి ఎం.విజయగౌరి, డిస్ట్రిక్ట్-101 ఆర్సీ-5 యు.శుభ, కోశాధికారి ఎం.భానుమతి, వైశాఖి స్పోర్ట్సు పార్కు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, ప్రస్తుత అధ్యక్షుడు భానుప్రకాష్, ఎం.శేషామణి పాల్గొని శిబిరం నిర్వహణకు సహకరించారు. ఈ సందర్భంగా వైద్యులను ఘనంగా సత్కరించారు.

కళావిహీనంగా వాటర్ ఫౌంటైన్


అక్కయ్యపాలెంలోని మహారాణి పార్లర్ కూడలిలో కళావిహీనంగా మారిన వాటర్ ఫౌంటైన్


ఫౌంటైన్ లోపల నాచుపట్టిన నీరు

సీతంపేట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన బ్యూటిఫికేషన్‌పై ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నిర్వహణ కొరవడింది. అభివృద్ధి పనుల్లో భాగంగా అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో మహారాణి పార్లర్ కూడలి వద్ద వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు చేశారు. ఫౌంటైన్ చుట్టూ హంసలు, వాటి నోటిలోంచి నీటి ధారలు విద్యుత్ వెలుగుల్లో చూడముచ్చటగా కనిపించేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫౌంటైన్ నిర్వహణ లోపించింది. నీటి ధారలు ఆగిపోయాయి కళావిహీనంగా మారింది. ఫౌంటైన్ లోపల నీరు పూర్తిగా నాచుపట్టి అధ్వానంగా మారింది. ఒకప్పుడు ఎంతో ఆకర్షణీయంగా కనిపించిన ఫౌంటైన్ నేడు కళావిహీనంగా మారడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫౌంటైన్‌ను పునరుద్ధించాలని కోరుతున్నారు.

రహదారి పైనే వ్యాపారంతో ఇబ్బందులు


రహదారిపై చేపల విక్రయం

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులోని చేపల మార్కెట్ ఇబ్బందులకు గురి చేస్తోందని ప్రసాద్‌గార్డెన్స్ స్థానికులు, స్క్రాప్ వ్యాపారులు వాపోతున్నారు. ముఖ్యంగా ఆదివారం రోడ్డుపై కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన చెందుతున్నారు. ఇక్కడి ఇందిరా మున్సిపల్ స్టేడియం ప్రహరీకి ఆనుకుని రహదారి పైనే చేపల విక్రయాలు జరుగుతున్నాయి. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు వచ్చి ఆది, మంగళ, శుక్రవారాల్లో వ్యాపారాలు చేస్తుంటారు. దీంతో చేపల నీళ్లు, వ్యర్థాలు చుట్టుపక్కల పేరుకుపోయి దుర్వాసన అలుముకుంటుంది. స్థానికుల ఇళ్లు, ఇక్కడి స్క్రాప్ వ్యాపారుల దుకాణాల్లోకి ఇది చేరి దుర్గంధభరితంగా మారుతోంది. గతంలో పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తాత్కాలిక చర్యలు తీసుకోవడవంతో పరిస్థితి మొదటికి వచ్చిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పచ్చదనాల పులకరింత..


ప్రకృతి రమణీయతకు ఈ చిత్రం అద్దం పడుతోంది. గొడుకు పట్టినట్లు ఉన్న వృక్షాల మధ్య ప్రయాణం సరికొత్త అనుభూతులు పంచుతోంది. రైల్వే న్యూకాలనీ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలు చూపరులను అలరించగమే కాకుండా ఎండ వేడి నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయి. - ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం